సీఎంఆర్ వసూళ్లకు.. ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు,సంగారెడ్డి: ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ కోసం మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మూడు జిల్లాల్లో 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యంతో పాటు సీఎంఆర్ బకాయిలను వసూలు చేసేందుకు ఆర్అండ్ఆర్ చట్టాన్ని ప్రయోగించనున్నారు. సిద్దిపేట జిల్లాలో పదిమంది మిల్లర్లను ఇందుకు ఎంపిక చేశారు. మెదక్ జిల్లాలో ధాన్యం వేలానికి సంబంధించి రూ.195 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.70కోట్లు చెల్లించారు. మరో రూ.125 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడేళ్లుగా వీటిని చెల్లించకుండా రాజకీయ నాయకుల అండదండలతో తప్పించుకుంటున్నారు. వీరితోపాటు, బహిరంగ విపణిలో విక్రయించి సొమ్ముచేసుకున్న వారిపై దృష్టిపెట్టారు.

తనిఖీలతో వెలుగులోకి అక్రమాలు:

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని మరాడించకుండా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ దందాను పసిగట్టి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టడంతో, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం వేలంతోపాటు, గత మూడు సీజన్ల ధాన్యం మరాడించకుండా కొందరు మిల్లర్లు బహిరంగ విపణిలో విక్రయించినట్లు నిర్ధారణ జరిగింది.

అక్రమార్కులపై ఈడీ దృష్టి: అన్నదాతల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు విక్రయించారు. వచ్చిన సొమ్ముతో స్థిరాస్తి, ఇతర దందాల్లో పెట్టుబడి పెట్టి ఆర్జించినట్లు తెలుస్తోంది. ఇటువంటి వారికి ఈడీ నోటీసులు జారీచేస్తోంది. మెదక్ జిల్లాలో కొందరు మిల్లర్లు పెద్దఎత్తున బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాకు చెందిన 22 మంది మిల్లర్లు నగదు చెల్లించకుండా కోర్టు మెట్లెక్కారు. దీంతో ఆగ్రహించిన ప్రభుత్వం వీరిపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ల ద్వారా..: 2011-12 నుంచి సీఎంఆర్ బకాయి పడ్డ మిల్లర్లకు ఆర్ఆర్ చట్టం ప్రకారం కలెక్టర్ల నేతృత్వంలో తహసీల్దార్ల ద్వారా నోటీసులు జారీచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో రూ.20 కోట్లకు సంబంధించి పది మిల్లులు, మెదక్ జిల్లాలోని మిల్లులు, సంగారెడ్డి జిల్లాలోని 4 మిల్లులకు నోటీసులు జారీచేశారు. వారికి ఆస్తులను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆదేశాలు జారీచేశారు. ఆగస్టు 31లోగా మిల్లర్లు బకాయిలో 50శాతం చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇచ్చారు. అయినా ససేమిరా అంటున్నారు. దీంతో నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది.

దశాబ్దం దాటినా.. ఇంకా నిశ్శబ్దం

ఐడీఏ బొల్లారంలో నిరుపేదల ఇళ్లు

న్యూస్‌టుడే, జిన్నారం

రాష్ట్ర ప్రభుత్వం 2015లో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లనుక్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టింది. 58, 59 జీవోలను విడుదల చేసి 125 గజాల స్థలం వరకు ఉచితంగా, దాటిన స్థలానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ధర ప్రకారం క్రమబద్ధీకరించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందుకోసం 2014జూన్2 నాటికి సంబంధిత ఇల్లుకు విద్యుత్తు, నల్లా బిల్లు, ఇంటి నంబరు ఉండాలనే నిబంధనలు పెట్టింది. అప్పటికే జిన్నారం, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలాల నుంచి 12 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్క జిన్నారం నుంచే నాలుగు వేలు రావడంతో విచారణ బృందాలు ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించాయి. 2015లోనే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి అయింది. ఇందులో జిన్నారం మండలంలో కేవలం 1200 వరకు మాత్రమే క్రమబద్ధీకరించి మిగిలినవి పెండింగ్ పెట్టారు.

- రూ.లక్షలు చెల్లించి క్రమబద్ధీకరణకు ఎదురు చూపులు

బాధితులు ఎందరో...

ఐడీఏ బొల్లారంలోని బాలాజీనగర్‌కు చెందిన మంజుల 80 గజాల ఇంటికి 2015 జనవరిలో రూ.67,500, రూ.50వేలు విడివిడిగా చెల్లించారు. ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.

● గాంధీనగర్‌కు చెందిన దేవమ్మ 2018లో రూ.1.4 లక్షలు చెల్లించినా ఫలితం లేకపోయింది.

● బీరప్ప బస్తీకి చెందిన మణెమ్మ రూ.1.02 లక్షలు చెల్లించి కార్యాలయం చుట్టు తిరిగినా కనికరించలేదు. రూ.1లక్షకు పైగా చెల్లించిన బాధితులు 500 మందికి పైగా ఉన్నారు. పాలకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది.

ఇళ్లు నిర్మించుకుందామంటే..:

ఐడీఏ బొల్లారం పంచాయతీ నుంచి 2018లో పురపాలికగా మారింది. అనంతరం సీఎంసీ పరిధిలోకి వెళ్లింది. జిన్నారం మండలంలోని ఏ గ్రామం కూడా పంచాయతీ పరిధిలో లేదు. ఫలితంగా దశాబ్దాలుగా రేకుల షెడ్డులోనే ఉండాల్సి వస్తోంది. దీనిని స్లాబ్ ఇళ్లుగా మార్చాలన్నా, రుణానికి బ్యాంకులకు వెళ్లినా సమస్యలొస్తున్నాయి. 2020లో ఈ రెండు జీవోలను మరో మారు విస్తరించి దరఖాస్తులు తీసుకున్నారు. ఇతర మండలాల అధికారులతో విచారణ చేయించారు. అర్హుల జాబితాను సిద్ధం చేసి క్రమబద్ధీకరించే సమయానికి ఎన్నికలు వచ్చాయి.

పెద్దలకు మేలు చేశారు..

కొందరు అధికారులు 59 జీవోను దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. ఇందులో భాగంగా ఐడీఏ బొల్లారంలోని రైతు బజార్‌ను ఓ ప్రైవేటు వ్యక్తి పేరిట పట్టా చేశారు. అలాగే గండిగూడెం రోడ్డులో కొంత భాగం క్రమబద్ధీకరణ అయింది. ఇదే సమయంలో బాలాజీనగర్‌లో రెవెన్యూ భూమిని పరాధీనం చేశారు. 44 సర్వేనంబరులోని విలువైన భూమిని ఓ ఫంక్షన్ హాల్‌కు, పరిశ్రమకు ఇచ్చారు. అధికారులను అడిగితే ప్రభుత్వ ఆదేశాలతోనే జీవో అమలు ఉంటుందని చెబుతున్నారు.

గుప్పు మంటోంది.. ముప్పు తెస్తోంది..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

● మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద 83.4 కిలోల ఎండుగ గంజాయిని ఆబ్కారీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ● వట్‌పల్లి మండలం దరఖాస్తుపల్లికి చెందిన ఓ రైతు పత్తి పొలంలో గంజాయి సాగు చేశారు. పోలీసులు దాడి చేసి 89 మొక్కలను పెకిలించి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ● మునిపల్లి మండలం గొర్రెగట్టు శివారులో ఓ రైతు సాగు చేయగా, పోలీసులు దాడులు చేసి 15 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్‌కు తరలించారు.

గంజాయిని స్వాధీనం చేసుకున్న ఆబ్కారీ పోలీసులు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తుండగా ఆబ్కారీ పోలీసులు తనిఖీలు చేపట్టి, ఆ మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల నాగల్‌గిద్ద మండలం ఏస్గీలో ఇంటి ఆవరణలో ఓ వ్యక్తి సాగు చేయగా, కేసు నమోదు చేశారు. అయినా అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో అంతరపంటగా దీనిని సాగు చేస్తున్నారు.

ఒడిశానుంచి దిగుమతి..

ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతాల నుంచి ఎండు గంజాయి రవాణా అవుతోంది. జిల్లా మీదుగా కర్ణాటక, మహారాష్ట్రలకు తరలిపోతుంది. కారులు, డీసీఎంలు, బస్సుల్లో తదితర వాహనాల్లో గుట్టుగా తరలిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, కార్మికులు లక్ష్యంగా ప్యాకెట్లుగా తయారీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పటాన్‌చెరు, హత్నూర, జిన్నారం, కొండాపూర్, సదాశివపేట, తదితర పారిశ్రామిక వాడల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనులు చేస్తున్నారు. వీరంతా మత్తులో మునిగిపోతున్నారు.

జిల్లాలో గతేడాది జనవరి 1నుంచి జులై 31వరకు

కేసులు	459
అరెస్టులు	206
స్వాధీనం చేసుకున్న మొక్కలు	685
స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి(కిలోలు)	90.48
వాహనాలు సీజ్	37

జైలు, జరిమానా..:

నార్కోటిక్ చట్టం ప్రకారం,, తక్కువ మోతాదులో గంజాయి రవాణా చేస్తే ఏడాది జైలు శిక్ష. 20 కిలోల లభిస్తే దాదాపు అయిదేళ్ల నుంచి 20 ఏళ్ల శిక్షతో పాటు రూ.25వేల నుంచి ఆపైన జరిమానా. ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తే పథకాలకు అనర్హులు.

కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం

– శ్రీనివాసరావు, ఆబ్కారీ శాఖ జిల్లా అధికారి

గంజాయి సాగు చేసినా, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవు. మత్తుకు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుంది. ఈ విషయమై సదస్సుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎస్‌హెచ్‌వో, జిల్లా స్థాయి టాస్క్‌పోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం.

నిలబడలేక.. నీరసించి..

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సోమవారం కిటకిటలాడింది. వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు చేసి ఔషధాలు రాసిచ్చారు. వాటిని తీసుకునేందుకు మందుల పంపిణీ కేంద్రం వద్ద వేచి ఉండలేక అవస్థలు పడ్డారు. కొందరు పడుకోగా, మరికొందరు కూర్చున్నారు. – ఈనాడు,సంగారెడ్డి

అయ్యా.. కరుణ చూపండి..

జహీరాబాద్ రాయిపల్లెకు చెందిన రత్నయ్య దివ్యాంగుల పింఛన్‌కు అర్జీఇచ్చారు. గుమ్మడిదలకు చెందిన సతీష్ ఇంటికోసం అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. సమస్యల పరిష్కారానికి తిరగాల్సి వస్తోందని వాపోయారు. – ఈనాడు,సంగారెడ్డి

నిబంధనలు తుక్కులో.. తొక్కేశారు!

న్యూస్‌టుడే, జిన్నారం

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి, ముత్తంగి, పాశమైలారం, చిట్కుల్, ఇస్నాపూర్, బండ్లగూడ ప్రాంతాల్లో గల్లీకో తుక్కు దుకాణం కొనసాగుతోంది. పేరుకే అవి అలా కనిపించినా రోజువారీగా రూ.లక్షల్లో దందా సాగుతోంది. ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతి కూడా ఉండదు. ఖాళీ స్థలంలో చుట్టూ ఇనుప షీట్లు పెట్టుకుని గుట్టుగా సాగిస్తారు. అక్కడ పని చేసేది ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులే. దీంతో ఏం జరుగుతుందో ఎవరికీ అంతుబట్టదు.

రసాయన వ్యర్థాలను..

ఈ దుకాణాలు కొన్ని గోదాముల్లా ఉంటాయి. కొన్ని చిన్నవే అయినా దందా సాగుతోంది. రసాయన, రసాయనేతర పరిశ్రమల్లోని వ్యర్థాలను దుండిగల్‌లోని వేస్ట్‌మెనేజ్‌మెంట్ ప్రాజెక్టుకు తరలించి నియంత్రించాలి. అలా కాకుండా డ్రమ్ములు, ప్లాస్టిక్ బస్తాలు, అట్టపెట్టెలు, ట్యాబ్లెట్లు ఇతర వ్యర్థాలను తెచ్చి ఇక్కడ శుద్ధి చేసి తిరిగి వినియోగించే చేస్తారు. అలా చేయడం నిబంధనలకు విరుద్ధం. దీని వల్ల వెలువడే కాలుష్యంతో పాటు అక్కడ పని చేసే కార్మికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే నిరుపేద కుటుంబాలకు అక్కడే ఆశ్రయం ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని కుంటలు, కాలువలకు ఆనుకుని ఉన్న దుకాణాల వద్ద రసాయనాలతో కూడిన డ్రమ్ములు, ప్లాస్టిక్ పేపర్లను శుద్ధి చేయటం వల్ల అవి విషపూరితంగా మారుతున్నాయి.

దొంగ సొత్తు సైతం...:

ఈ దందా రాత్రి పూట సాగుతోంది. పరిశ్రమల్లో పనిచేసే కొందరితో చేతులు కలిపి అక్కడ నిలువ ఉండే ఇనుము వంటి వాటిని విక్రయిస్తున్నారు. రూ.10 వేల సొత్తును రూ.2 వేలకే అమ్మేస్తారు. ఇటీవల గడ్డపోతారంలో నిర్మిస్తున్న ఓ ఆలయం నుంచి రూ.40 వేలు విలువ చేసే ఇనుప రాడ్లను కేవలం రూ.800కే తుక్కు దుకాణాలకు విక్రయించడం చర్చకు దారితీసింది. ఇదే సమయంలో అన్నారంలో ఓ దుకాణంలో చాలా సార్లు ప్రమాదం జరిగింది. అధికారులు దృష్టిసారిస్తే ఇక్కడ జరిగే అక్రమాలను అరికట్టవచ్చు. పర్యావరణ పరిరక్షణతో పాటు చోరీలను తగ్గించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

మంత్రి గారూ.. ఊ అనండి సారూ!

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్,

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలను రూ.కోట్లు వెచ్చించి పూర్తి చేశారు. వాటిని ప్రారంభించడంలో జాప్యం సాగుతోంది. వాటిని సత్వరం వినియోగంలోకి తేస్తే నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలి.

తప్పని ఎదురుచూపులు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయింది. ప్రారంభోత్సవానికి ఎదురు చూపులు తప్పడంలేదు. రూ.7.50 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో చేపట్టిన ఈ భవనం పనులు నాలుగు నెలల క్రితమే పూర్తయ్యాయి. గర్భిణులు, బాలింతలు సహా నవజాత శిశువులకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్తాం:

– లలితాదేవి, జిల్లా వైద్యాధికారిణి, సంగారెడ్డి

వైద్యారోగ్యశాఖ పరిధి ఆస్పత్రులు, నర్సింగ్ కళాశాలలు ఇతర భవనాలు పూర్తయ్యాయి. వీటి గురించి మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి, ప్రారంభించేలా చూస్తాం. పరికరాలు కూడా సరఫరా చేస్తాం. ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తాం.

పరికరాలు రాకపోవడం వల్ల..

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి కాలనీలో నర్సింగ్ కళాశాల భవనాన్ని పూర్తి చేశారు. వసతి గృహ భవనాల పనులు పూర్తయ్యాయి. 2022లో ఫిబ్రవరిలో వీటికి రూ.34 కోట్లు వెచ్చించారు. పనులు ఈ ఏడాది జనవరిలో పూర్తయ్యాయి. ఫిబ్రవరిలో ప్రారంభోత్సం చేస్తామని ప్రకటించారు. పరికరాలు రాకపోవడం వల్ల వాయిదా పడుతోందని ఆశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం 240 మంది నర్సింగ్ విద్యార్థినులున్నారు. సొంత భవనంలేక దుర్గాబాయి శిశు వికాస, శిశు గృహ భవనంలో కొనసాగిస్తున్నారు. వెంటనే ప్రారంభిస్తే అద్దె భారం తగ్గనుంది.

మూడేళ్లుగా ఇదే పరిస్థితి

న్యూస్‌టుడే: జిన్నారం మండల కేంద్రమైన జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ.1.65 కోట్లతో నిర్మించిన భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభం కావడం లేదు. మురుగు కాలువ, ప్లంబింగ్ పనులు మినహా అన్నీ గతంలోనే పూర్తయ్యాయి. పాత భవనం పెచ్చులూడి పడుతున్నా, నూతన భవనాన్ని అందుబాటులోకి తేవడం లేదు. సుమారు 20 గ్రామాలకు ఈ ఆసుపత్రే దిక్కు. నల్తూరు, శివనగర్, జిన్నారంలోనూ బస్తీదవాఖానాల భవనాలు పూర్తయినా ప్రారంభించడం లేదు.

ఆటకు జై.. పోటీకి సై

* నేటి నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఇందులో భాగంగా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో క్రీడాపోటీలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 1 నుంచి 7 వరకు మండల స్థాయిలో కొనసాగించాలి. ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా, ఆదర్శ, గురుకుల పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారు.

నిధుల్లేకుండా..: అన్ని మండలాల్లో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు మాత్రమే నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు ఒక్కో మండలానికి గతేడాది రూ.15 వేలు కేటాయించారు. 2026-27కు సంబంధించి రూ.30 వేలు అవసరమని ప్రతిపాదనలు రూపొందించారు. మంజూరు కాలేదు.

రెండు విభాగాల్లో..: అండర్- 14, 17 బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. ఒక్కో మండలంలో రెండు, మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవోల ఆధ్వర్యంలో కొనసాగుతాయి. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారికి జిల్లా స్థాయి జట్లకు ఎంపిక చేస్తారు.


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

జిల్లా స్థాయిలో 27 క్రీడాంశాలు:

జిల్లా స్థాయిలో 27 క్రీడాంశాలు ఉంటాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు బాస్కెట్ బాల్, పుట్‌బాల్, తదితర పోటీలు నిర్వహిస్తారు. ఆయా పోటీల్లో రాణించిన వారినిజిల్లా స్థాయికి పంపుతారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.

ఈసీ ఆదేశాలా..ఐసీ!

● నోటీసులు ఇచ్చేందుకు ఇంటి వద్దకు వెళ్లని బీఎల్‌వోలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. మ్యాపింగ్‌కాని, అనామలీస్ ఓటర్లకు ప్రస్తుతం నోటీసుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఇంటింటికీ వెళ్లి వీటిని అందించాలి. చాలా చోట్ల బూత్ స్థాయి అధికారులు పట్టించుకోవడంలేదు. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ భవనాల వద్దకు పిలిపించి అందిస్తున్నారు.

రెండుసార్లు వెళ్లాల్సి ఉన్నా..: బూత్ స్థాయి అధికారులు ఇంటికి వెళ్లిన సమయంలో సదరు వ్యక్తులు లేకపోతే రెండో సారి వెళ్లాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ ఆదేశాలను బీఎల్‌వోలు పక్కనపెడుతున్నారు. చాలా చోట్ల ఒక్కసారి కూడా ఇంటికి వెళ్లడంలేదు.

ఇంటి వద్దకే వెళ్లి అందించాలి:

– రాజేందర్, ఆర్డీవో(సంగారెడ్డి)

నోటీసులు ఇంటివద్దకే వెళ్లి అందించాలి. ఇప్పటికే బీఎల్‌వోలకు ఇదే విషయాన్ని స్పష్టం చేశాం. ఎన్నికల సంఘం నిబంధనలను అందరూ పాటించాల్సిందే. పట్టణ ప్రాంతాల్లో నోటీసులు జారీ చేయడం కొంత కష్టంగా మారింది. చిరునామాతోపాటు వారి ఫోన్ నంబర్లు కూడా మారడమే దీనికి కారణం. నోటీసులను గడువు లోగా చేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

జాప్యంతో ఇక్కట్లు..

నోటీసుల జారీలో జాప్యం జరుగుతోంది. వీటిని చదివి ఇందుకు అనుగుణంగా ఆధారాలు సమర్పించేందుకు సమయం ఇవ్వడంలేదని ఈ జాబితాలో ఉన్న వారు ఆరోపిస్తున్నారు. మ్యాపింగ్‌కాని, అనామలీస్ జాబితాల్లో కలిపి 4,60,389 మంది ఉండగా వీరందరికీ నోటీసులు జారీ చేయనున్నారు. ఇప్పటి వరకు 1,35,602 మందికే అందజేశారు. అంటే 29.45 శాతమే అయింది.

చిరునామా దొరకదు..ఫోన్ నంబర్లు మనుగడలో లేవు

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఉపాధికి వచ్చి వలస ఉండే వారి చిరునామా తరచూ మారుతోంది. ఇప్పుడు అలాంటి వారి చిరునామా తెలుసుకోవడం బీఎల్‌వోలకు పరీక్షగా మారింది. ఫోన్ నంబర్లు మారడం గమనార్హం. అత్యధిక నోటీసులు పటాన్‌చెరు నియోజకవర్గానివే ఉన్నాయి.

ఉన్నంతలో.. తిన్నంత!

ధరలు పెరగడంతో మారుతున్న బడుగుల బడ్జెట్

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్,

సంగారెడ్డికి చెందిన వెంకట్ కుటుంబంలో మొత్తం నలుగురు సభ్యులు. ఓ దుకాణంలో పని చేస్తుండగా.. నెలకు రూ.12 వేల వరకు వేతనం పొందుతున్నారు. నిత్యావసరాల కొనుగోలు. ఇద్దరు పిల్లల చదువుకు వెచ్చించాల్సిన పరిస్థితి. కొన్నాళ్లుగా నిత్యావసరాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో నెల బడ్జెట్‌కు అదనంగా రూ.3 వేలు అవసరమవుతున్నాయి. మాంసాన్ని 15 రోజులకోసారి తింటున్నారు. ఇలా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. నెలనెలా బడ్జెట్ మారుతున్న తీరుతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఖర్చులు తగ్గించి, ఉన్నంతలో సర్దుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సాగు జీవనాధారం..: సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. పేద, మధ్య తరగతి కుటుంబాల శాతం ఎక్కువే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. ఎల్‌నినో పరిస్థితుల్లో సాగు ఆశాజనకంగా లేదు. ఆశించిన మేర సీజన్ లేని పరిస్థితుల్లో పలువురు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక పెరుగుతున్న ధరలు దడ పుట్టిస్తున్నాయి. అల్పాహారం, భోజనం, చిరుతిళ్లు, ప్రైవేటు వాహనాల ఛార్జీల్లో పెరుగుదల స్పష్టమవుతోంది.

గడవడం కష్టమవుతోంది: అనసూయ

ధరలు పెరగడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. కుటుంబ సభ్యులమంతా పొదుపు చేయాలని నిర్ణయించుకున్నాం. గతంలో నెలకు రూ.3వేల వరకు ఖర్చయ్యేది. ఇప్పుడు నాలుగు వేలు దాటుతోంది. ఏం చేయాలో అర్థం కావడంలేదు. సర్కారు దృష్టిసారించిధరలు అందుబాటులోకి తేవాలి.

ప్రాధాన్య క్రమం చూడాలి..

– ప్రొఫెసర్ కె.భవాని, ఆర్థిక విశ్లేషకురాలు, దుబ్బాక

ధరలు పెరిగిన నేపథ్యంలో ఇంట్లో అందరూ పొదుపు అలవర్చుకోవాలి. వృథా ప్రయాణాలు, వాహన వినియోగం తగ్గించాలి. సరకుల వాడకాల్లో మెలకువలు పాటించాలి. ప్రాధాన్య క్రమంలో జాబితాలు రూపొందించాలి. ఆరోగ్యం, అత్యవసర అంశాల్లో వెనకడుగు వేయొద్దు. ఖర్చులు తగ్గించుకోవాలి. చిన్నపాటి పెట్టుబడుల ద్వారా ఆర్థిక వృద్ధి సాధించవచ్చు.

వివరాలు లక్షల్లో..

జిల్లా	జనాభా	కుటుంబాలు	గ్యాస్ వినియోగదారులు	వాహనాలు
సంగారెడ్డి	15.27	4.10	6.10	3.67

ధరల్లో మార్పు ఇలా.. (కిలో.. రూ..లలో)

విభాగం	9 నెలల క్రితం	ప్రస్తుతం
వంటగ్యాస్	923.50	1012.50
కారం	300	420
వంట నూనె	148	180
కందిపప్పు	120	135
పాలు(లీటరు)	80	84
చక్కెర	44	60
పెట్రోల్ (లీటరు)	107.71	115.94
డీజిల్ (లీటరు)	95.93	104.05
మటన్ (కిలో)	800	900
కోడిగుడ్లు (30)	150	189

రూ.2 నుంచి రూ.3 వేలు అదనంగా..:

దాదాపు తొమ్మిది నెలల్లో నిత్యవసరాల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలపై సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేలు అదనంగా పడుతోంది. మాంసం, కూరగాయల ధరల్లోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో ఖర్చులు తగ్గించేందుకు దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు, దినసరి వేతనంపై పని చేసే వారు తర్జనభర్జనకు గురవుతున్నారు.

వెతలు వినండి.. వేతనాలు ఇవ్వండి

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థలో విధులు నిర్వహించే క్లస్టర్ రిసోర్స్ పర్సన్లది కీలకపాత్ర. మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించాలన్న, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చాలన్న వీరే పని చేయాలి. వీరికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

201 మంది ఎదురు చూపులు:

జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో 201 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు విధులు నిర్వహిస్తున్నారు. 15 నుంచి 20 గ్రూపులకు ఓ సమాఖ్య ఉంటుంది. వీరి కింద ఆర్పీ పని చేస్తారు. వీరికి నెలకు రూ.6 వేలను మెప్మా మహిళా సమాఖ్య ఖాతాలో జమ చేస్తారు. అక్కడి నుంచి తీసుకుంటారు. అంతేకాకుండా సమాఖ్య లాభాల్లో ఉంటే నెలకు రూ.2 వేలు అదనంగా అందుతుంది. జిల్లా వ్యాప్తంగా 201 మందికి మే,జూన్, జులై సంబంధించి రూ.36.18 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంది.

విధులు..: ప్రభుత్వ పథకాలు, మహిళలను బలోపేతం చేయడం, రుణాలు ఇప్పించడం, తిరిగి చెల్లించేలా చూడడం. సంఘాల సమావేశాల నిర్వహణ కూడా చేపట్టి, సలహాలు, సూచనలు అందిస్తారు. వార్డుల్లో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

వెంటనే జమ చేస్తాం: మల్లీశ్వరి, డీఎంసీ

మెప్మా పరిధిలో పని చేసే ఆర్పీలకు మూడు నెలల వేతనాలు విడుదల కావాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండు, రోజుల్లో విడుదల అయ్యే అవకాశం ఉంది. రాగానే వెంటనే వారి ఖాతాలో జమ చేస్తాం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000014771
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

(c) eenadu

మహిళా క్రికెటర్లకు మంచి భవిష్యత్తు

• గ్రామీణ ప్రాంతాలకు వచ్చి ప్రతిభ వెలికితీస్తాం • 'న్యూస్‌టుడే'తో తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: మహిళా క్రికెట్‌కు కొన్ని సంవత్సరాలుగా ఆదరణ పెరుగుతోంది. 2025లో వరల్డ్ కప్ సాధించిన తరువాత యువతులు క్రికెట్ నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారు. స్మృతి మంధానా.. హర్మన్‌ప్రీత్ కౌర్, షెఫాలివర్మ, దీప్తిశర్మ వంటి క్రికెటర్లను స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే నిర్వహించే మహిళా క్రికెట్ ఎంపికలు మొదటి సారిగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డిలో సోమవారం నిర్వహించారు. భారత మాజీ క్రికెటర్, తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి మాట్లాడింది. కార్యాచరణ ఆమె మాటల్లోనే..

హెచ్‌సీఏ ప్రత్యేక చర్యలు

గ్రామాల్లోనే ప్రతిభావంతులైన మహిళా క్రికెటర్లు ఉన్నారు. సరైన సదుపాయాలు, ప్రోత్సాహం లేక వెనుకబడుతున్నారు. వారిని గుర్తించేందుకు హెచ్‌సీఏ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహిస్తాం. ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

మొదటి సారిగా జిల్లాల్లో..

హైదరాబాద్‌లోనే పరిమితమైన ఎంపికలను మొదటి సారిగా ఈ జిల్లాలో చేపడుతున్నాం. మేమే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిసరాలు, పరిశీలిస్తాం. స్థానికంగానే నేర్పిస్తాం. అవసరాలను సమకూరుస్తాం.

లీగ్ మ్యాచ్‌లతో తేల్చుతాం

సునీత ఆనంద్

ముఖాముఖి

గతంలో కేవలం ఓపెన్ సెలక్షన్స్ మాత్రమే జరిగేవి. ఆ సమయంలో ఆడలేని వారు వెనుకబడతారు. లీగ్ మ్యాచ్‌లు నిర్వహించి ఎంపికలు చేస్తాం. ప్రతిభ ఉన్న గ్రామీణుల ప్రతిభ వెల్లడవుతుంది.

రోజూ 4 గంటల సాధన

జాతీయ స్థాయి క్రికెట్ వరకు రావాలంటే నిత్యం సాధన ఉదయం, సాయంత్రం 4 గంటల సాధన అవసరం. అనువజ్ఞులైన శిక్షకుల సహాయం తీసుకోవాలి. కఠినంగా ప్రాక్టీస్ చేస్తేనే ముందంజ వేయగలుగుతారు. జిల్లాల్లో ఇండోర్ మైదానాలు, వసతులు, కోచ్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటాం.

ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన మహిళా క్రికెటర్లకు సూచనలు ఇస్తున్న తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

గల్లీ గల్లీ.. శబ్దాల లొల్లి!

• ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల మార్పు

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం శబ్దం 75-80 డెసిబుల్స్

ద్విచక్ర వాహనదారులు వేసిన సైలెన్సర్ల శబ్దం 100-120 డెసిబుల్స్

సిద్దిపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

జిల్లా	మొత్తం వాహనాలు	ద్విచక్ర వాహనాలు
వికారాబాద్	1,48,285	56,627
సంగారెడ్డి	3,67,948	2,34,246
మెదక్	1,42,693	61,140
సిద్దిపేట	3,87,407	2,61,438

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట: వాహనదారుల్లో కొందరి సరదా మరికొందరి ప్రాణాల మీదకు తెస్తోంది. ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను అమర్చుతున్నారు. భారీ శబ్దం, గాలి కాలుష్యంతో హడలెత్తిస్తున్నారు. ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారంతా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. వీరిలో మహిళలు సైతం ఉంటున్నారు. ద్విచక్ర వాహనాలను తోలడం సాధారణంగా మారింది. ప్రధానంగా బుల్లెట్ ప్రియులు పాతతరం భారీ శబ్దం టపాసుల పేలుడు మాదిరి వచ్చే సైలెన్సర్లను అమర్చుతున్నారు. వేగంతో కూడిన శబ్ద తీవ్రత చుట్టుపక్కల వారికి ప్రమాదకరంగా ఉంటోంది.

ఇబ్బందులు ఇలా..

- భారీ శబ్దంతో రాకపోకల సమయంలో స్థానికులు, తోటి వాహనదారులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదముంది.
- వెల్డింగ్, వడ్రంగి, చెరుకు బండి వంటి వాటిలో ఆకస్మిక పెద్దశబ్దానికి ఏకాగ్రత కోల్పోయి గాయాల పాలవుతున్నారు.
- బాలలు, వృద్ధులు, గర్భిణులకు ఆందోళన పెరుగుతుంది.
- రక్తపోటు పెరుగుతుంది.
- చెవులు దెబ్బతిని వినికిడి లోపం వస్తుంది.
- మానసిక ఒత్తిడికి గురవుతారు.

చలానాలు విధిస్తారని.. పోలీసుల కన్నుగప్పి..

పోలీసులు ప్రధాన రహదారులు, కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా కొన్నిసార్లు పట్టుబడుతున్నారు. వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల చలానా విధిస్తున్నారు. కొందరివి జప్తు చేశారు. గతంలో ముప్పై వాహనాలవి తొలగించి ధ్వంసం చేశారు. సిద్దిపేటలోనూ పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో పది రోజుల క్రితం 240 సైలెన్సర్లు తీయించి రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఇంకా చాలాచోట్ల వాహనదారులు కొందరు వినియోగిస్తూ ప్రజలను హడలగొడుతున్నారు.

ముడుపులు.. వృక్షాభరణాలు

న్యూస్‌టుడే, చేర్యాల: మదినిండా 'మల్లన్న' నామస్మరణ చేస్తూ సుదూర ప్రాంతాల నుంచి కొమురవెల్లికి వచ్చే భక్తులు తమ కోర్కెలు తీర్చాలని వేడుకుంటారు. పలు విధాలుగా మొక్కులు చెల్లించుకుంటుంటారు. కొందరు పట్నాలు వేయడం, బోనాల నైవేద్యం సమర్పించడం, హుండీల్లో కానుకలు వేస్తుండగా.., మరి కొందరు మళ్లొచ్చే బ్రహ్మోత్సవాలలోపు తాము కోరిన కోరిక తీరాలంటూ ఆలయానికి ముందున్న గంగరేణి చెట్టు వద్ద ఇనుప చువ్వలకు ముడుపు కట్టి ప్రణమిల్లుతారు. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఇలా కడతారు. కోరిక తీరగానే మళ్లీ వచ్చే బ్రహ్మోత్సవాల సమయంలో ముడుపు విప్పి, అందులోని కొబ్బరికాయ కొట్టి మొక్కుబడి చెల్లించుకుంటారు. యేటా 'మల్లన్న' దర్శనానికి సుమారు 30 లక్షలకు పైగా భక్తులు వస్తారు. వందల సంఖ్యలో ఇలా ముడుపు కట్టి వెళ్తారు. దాదాపు వందేళ్ల కిందటి నుంచి ఈ గంగరేణి చెట్టు ఉంది.

మల్లన్న గుడిలో గంగరేణి చెట్టు వద్ద ముడుపులు

కేతకి సంగమేశ్వరుడికి రుద్రాభిషేకం

ఝరాసంగం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకి ఆలయానికి శ్రావణమాసం మూడో సోమవారం భక్తులు భారీగా తరలివచ్చి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృతంతో రుద్రాభిషేకాలు, బిల్వార్చన, మంగళహారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న అమృత గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహారాష్ట్రలోని అహ్మదాపూర్‌కు చెందిన వెయ్యి మంది భక్తులు పాదయాత్రగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శివరుద్రప్ప, సీఐ హన్మంతు, ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ పర్యవేక్షించారు.

వ్యసనాలకు బానిసై యువకుడి బలవన్మరణం

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా వీరారెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన **కానుగంటి నర్సింలు** (33) వ్యవసాయం చేస్తుంటాడు. వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హుల ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్తపడాలి: వెన్నెల

దుబ్బాకలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల

దుబ్బాక: సర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా జాబితాలో పేర్లు గల్లంతైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్, సర్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి డా.జి.వెన్నెల అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో 'సర్' ఫేజ్-2పై బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనామలీస్ ఓటర్లకు సంబంధించి నోటీసులు అందుకుంటున్న వారి సందేహాల నివృత్తికి పార్టీ నాయకులు సహకరించాలన్నారు. దుబ్బాక, తొగుట ఏఎంసీ ఛైర్మన్లు కొంగర రవి, చెరుకు విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం

కవల పిల్లలతో ఈఎంటీ గురప్ప

కంగ్టి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం సిద్ధహంగిర్గ గ్రామానికి చెందిన మరియమ్మ(28) సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆమెను 108 వాహనంలో కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. బాలిక, బాలుడు జన్మించారు. ఆమెకు ఇప్పటికే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆసుపత్రిలో క్షేమంగా ఉన్నారని ఈఎంటీ గురప్ప తెలిపారు. అంబులెన్స్‌లో కవలలు జన్మించడం ఈ ప్రాంతంలో ఇదే తొలిసారి అని చెప్పారు.

ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి మున్సిపాలిటీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సంఘం సహకారంతో మహిళా క్రికెట్ జట్టు ఎంపిక సోమవారం సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో నిర్వహించారు. తెలంగాణ మహిళా క్రికెట్ అసోసియేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి 38 మంది పాల్గొనగా.. ప్రతిభ చూపిన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆమె చెప్పారు. సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి, కోచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, ఖలీముద్దీన్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి చిరు వ్యాపారి పరారీ

పాపన్నపేట: ప్రజల నుంచి అప్పులు తీసుకొని ఓ చిరు వ్యాపారి పరారైన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు.. పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యాపారి తన కుటుంబంతో కలిసి మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని చిత్రియాల్ క్రాస్‌రోడ్‌కు వలస వచ్చారు. అక్కడే చిన్న కిరాణా దుకాణం నడిపిస్తున్నారు. ఈ క్రమంలోనే దుకాణానికి వచ్చే ప్రజలతో సన్నిహితంగా ఉంటూ స్థానికుల వద్ద నమ్మకస్థంగా ఉన్నారు. ఇదే అదనుగా వ్యాపారం, ఇంటి నిర్మాణం కోసం డబ్బులు అవసరమని కొన్నేళ్లుగా చిత్రియాలతో పాటు పరిసర గ్రామాల ప్రజల వద్ద రూ.లక్షల్లో అప్పులు తీసుకున్నారు. కొన్ని రోజుల కిందట ఇంటికి తాళం వేసి రాత్రికి రాత్రే గ్రామం నుంచి కనిపించకుండా పరారయ్యారు. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో మోసపోయామని బాధితులు గుర్తించారు.

అల్లం సాగు.. తెగుళ్ల నివారణతో బాగు

రైతుకు మెలకువలు చెబుతున్న వ్యవసాయ అధికారి

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: అల్లం సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి పండరి సూచించారు. తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అల్లంసాగులో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

బ్యాక్టీరియా వడలు తెగులు: ఈ తెగులు ప్రస్తుతం ఎక్కువగా ఆశిస్తోంది. తెగులు సోకిన ఆకుల అంచులు ఇత్తడిరంగుకు మారడంతో పాటు వెనకకు ముడుచుకుపోతాయి. క్రమంగా మొక్క వడలి ఎండిపోతుంది. భూమికి దగ్గరలోని కాండాన్ని పరిశీలిస్తే చెడు వాసన వస్తుంది. నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 20 గ్రా./ 100 లీటర్ల నీటికి కలిపి మొక్క వేర్ల వద్ద పిచికారీ చేయాలి.

దుంపకుళ్లు తెగులు: ఈ తెగులు ముఖ్యంగా నీరు నిల్వ ఉండే నేలల్లో కనిపిస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. తెగులు సోకని పొలం నుంచి విత్తనం ఎంచుకోవాలి. పొలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తెగులు లక్షణాలు కనిపిస్తే ట్రైకోడెర్మావిరిడి 10 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

పొలుసు పురుగు: విత్తన దుంపలను ఆశించి రసం పీల్చుతాయి. విత్తన దుంపలను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున మలాథియాన్ కలిపిన ద్రావణంలో 30 నిమిషాలు నానబెట్టాలి. విత్తనం ఆరబెట్టాక విత్తుకుంటే పురుగు నివారించవచ్చు.

వేరుపురుగు: దుంపల మొదళ్లలో వేర్లను కత్తిరిస్తుంది. నష్టం గమనించగానే ఫోరేట్ గుళికలు 5 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి ఏడు కిలోలు వేయాలి.

మొవ్వుతొలుచు పురుగు: ఈ పురుగు మొవ్వును తొలచడం వల్ల మధ్య కొమ్మ చనిపోతుంది. నివారణకు లీ. నీటికి డైమిథోయేట్ 2 మి.లీ.+సాండోవిట్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఫిల్లోస్టికా ఆకుమచ్చ తెగులు: ఈ తెగులును ఆకులపై జులై నుంచి అక్టోబరు మాసాల్లో గమనిస్తాం. ప్రారంభదశలో ఆకులపై అండాకారంలో ఉండి నీటిని పీల్చుకున్నట్లుగా మచ్చలు ఏర్పడతాయి. ఆకులు పెళుసుగా మారతాయి. నల్లటి మచ్చలు ఆకుల ఉపరితలంపై ఏర్పడి ఎండిపోతాయి. ఆక్సీక్లోరైడ్ గల శిలీంద్రనాశిని(బ్లైటాక్స్) మందును 3గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు **9963164507**

న్యూస్‌టుడే, చేర్యాల:

ప్రశ్న: వేరుసెనగలో జిప్సం ఎంత మోతాదులో వేయాలి? – యాదగిరి, రైతు, తాండూరు

సమాధానం: నీటి పారుదల ఉన్న ప్రాంతాల్లో ఎకరానికి 200 కిలోల జిప్సం తొలిపూత సమయంలో వేసుకుంటే నూనె గింజ పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చు.

ప్రశ్న: మిశ్రమ ఎరువులతో కలిపి జింక్ వేసుకోవచ్చా? – బాలకిషన్, దుబ్బాక

సమాధానం: భాస్వరం, జింక్ ఎరువులను ఎప్పుడూ కలిపి వేయకూడదు. వీటి మధ్య వ్యతిరేక చర్యల వల్ల వేసిన జింక్ లభ్యత తగ్గడం లేదా పూర్తిగా అందకపోవచ్చు. భాస్వరం ఎరువు వేసిన మూడు, నాలుగు రోజుల తర్వాత జింక్ ఎరువు వేసుకోవాలి.

చందుపట్ల పల్లవి, శాస్త్రవేత్త (తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం - సిద్దిపేట)

కంది, పత్తిలో కలుపుంటే..

కంది, పత్తి పైర్లకు అవసరం మేరకే నీరందేలా చూడాలి. అంతర కృషి ద్వారా ఎప్పటికప్పుడు కలుపు తొలగించాలి. నీటిఎద్దడి వల్ల మొక్కకు సరైన మోతాదులో పోషకాలు అందక ఎదుగుదల ఆగిపోయే ప్రమాదముంది. అందుకు 2 శాతం యూరియా ద్రావణం లేదా రెండు శాతం డీఏపీ లేదా 5 శాతం 19.19.19 ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, చేర్యాల

మీకు తెలుసా..?

పంటల సాగుకు రైతులు బిందు సేద్యం పద్ధతి పాటిస్తే 40 శాతానికి పైగా నీరు ఆదా అవుతుంది. దీంతోపాటు 15-40 శాతం ఎరువులు, 20-30 శాతం రసాయనాలు, 10-15 శాతం కూలీల అవసరం తగ్గి 30-70 శాతం దిగుబడులు పెరిగి భారీగా లాభం పొందుతారు.

– న్యూస్‌టుడే, చేర్యాల

పూల తోట.. లాభాల బాట

ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు

సరవ్వ

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: పూల సాగు చేపట్టిన ఓ మహిళా రైతు అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. రోజువారీ ఆదాయంతో లాభాల బాటలో పయనిస్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిల్లకు చెందిన మూడెడ్ల సరవ్వ తనకున్న వ్యవసాయ భూమిలో సంప్రదాయ పంటలతో పాటు కొంత విస్తీర్ణంలో పూల తోటలు పెంచుతున్నారు. 10 గుంటల్లో దొడ్డుమల్లె, మూడు గుంటల్లో సన్న జాజి మల్లె, గట్లవెంట కాగడా మల్లె వేస్తున్నారు. వీటితో పాటు కనకాంబరాలు, చామంతి, పట్టుకుచ్చులు వంటివి సాగుచేస్తున్నారు.

పూలమొగ్గలు

తండ్రి నుంచి నేర్చుకుని..

• సరవ్వ తన తండ్రి మారుపాక రాజయ్య నుంచి పూలసాగును నేర్చుకున్నారు. ఆయన 40 ఏళ్ల క్రితమే వివిధ రకాల పూలతోటలు సాగు చేసేవారు. • మొక్కల వద్ద కలుపు తీయడం, నీరందించడం, పూలు తెంపడానికి సరవ్వ ప్రత్యేకంగా ఒక మహిళా కూలీని నియమించుకున్నారు.

• దొడ్డు మల్లెచెట్లు వేసవిలో పూస్తాయి. ప్రస్తుతం సన్నజాజి, కాగడ మల్లెచెట్లు మాత్రమే పూస్తున్నాయి. సీజన్‌లో అయితే రోజుకు 3 నుంచి 4 కిలోలకు పైగా పూలు వస్తాయని, ప్రస్తుతం సన్నజాజి రోజుకు 2 కిలోల పూల దిగుబడి వస్తోందన్నారు.

నేరుగా వినియోగదారులకే విక్రయం

• పూసిన పూలను ఒక్కోసారి కిలోల చొప్పున, మిగతా సమయాల్లో మూరల చొప్పున విక్రయిస్తున్నారు. • రోజూ తెంపిన పూలను కుటుంబసభ్యులు మాలలు కడతారు. వాటిని సరవ్వ రోజూ సిద్దిపేటలో నేరుగా వినియోగదారులకు విక్రయిస్తోంది.

• ప్రస్తుతం మూరకు రూ.30 చొప్పున, రోజుకు 15 మూరలు విక్రయిస్తూ నిత్యం రూ.450కి పైగా ఆదాయం పొందుతున్నారు.

• పూల లభ్యత, పెళ్లిళ్లు, ఇతర శుభాకార్యాల సీజన్‌ను బట్టి ధరలు మారతాయని సరవ్వ కూతురు శ్రీలక్ష్మి తెలిపారు.

• కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇతర పంటల కన్నా పూలసాగుతో మంచి లాభాలు పొందవచ్చని, వీటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలతో పాటు ఇతర పంటల పెట్టుబడికి ఉపయోగపడుతుందంటున్నారీ మహిళా రైతు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగ అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన నిందితురాలు

తాండూరు, వికారాబాద్, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగను సీసీఎస్ పోలీసులు తాండూరు పట్టణంలో అరెస్టు చేశారు. వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్ సోమవారం వికారాబాద్ ఠాణాలో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూరు భీమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ అసాడే తాండూరు పట్టణ ఠాణా పరిధిలో జరిగిన 5 చోరీల్లో 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించింది. చోరీలను ఛేదించేందుకు ఎస్పీ స్నేహమెహ్రా వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్‌కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నేరాలు జరిగిన తీరును క్షుణ్నంగా పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితురాలి కదలికలను గుర్తించారు. లక్ష్మీ అసాడే ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలతో పరిచయం పెంచుకుంటుంది. దృష్టి మరల్చి వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులను ఎత్తుకెళుతుంది. వరుసగా జరిగిన కేసుల్లో సారూప్యతను పోలీసులు గుర్తించారు. తాండూరు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసుల మధ్య ఉన్న నేరాల విధానాన్ని పోల్చి చూశారు. సోమవారం నిందితురాలు తాండూరు బస్టాండ్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షోలాపూరు జిల్లా ఎంఐడీసీ ఠాణా పరిధిలో 3, బార్శి, హైదరాబాద్ సిటీ మార్కెట్ ఠాణాల పరిధిలో ఒక్కో కేసు నమోదైందని గుర్తించారు. తాండూరులో మాదిరిగానే కర్ణాటక రాష్ట్రంలోని గదక్‌టౌన్‌లో 2, నవనగర్ ఠాణా పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో 14.5 తులాల బంగారు ఆభరణాల చోరీల్లో నిందితురాలి ప్రమేయమున్నట్లు గుర్తించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాండూరు పట్టణ ఎస్సై మమత, హెడ్ కానిస్టేబుళ్లు జయవర్ధన్, శివకుమార్, పాండు, రాజు, రవీందర్, గాయత్రిని అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా అభినందించారు.

మహిళల రక్షణకు అనేక చట్టాలు: పద్మజా రమణ

చేర్యాలలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మజా రమణ

చేర్యాల, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని, ఏ సమస్య ఎదురైనా మహిళలు నేరుగా కమిషన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటామని తెలంగాణ మహిళా కమిషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మజా రమణ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల కస్తూర్బా విద్యాలయంలో సోమవారం జరిగిన మహిళలు, బాలికల భద్రత, ఆరోగ్యం, హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల హక్కులు, రక్షణకు సంబంధించి సుమోటో కేసులు స్వీకరిస్తామని, అందుకే బాలికలు చట్టపరమైన రక్షణ సహాయ వ్యవస్థలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారిణి శారద, ఎంఈవో నరేందర్, పురాధ్యక్షురాలు ముస్త్యాల అరుణ, కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, సీడీపీవో రమాదేవి, చేర్యాల ఎస్సై అపూర్వరెడ్డి, సైబర్‌క్రైం ఎస్సై దివ్య, వైద్యురాలు హరితరెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్

• దరఖాస్తుకు చివరి తేదీ 31 అక్టోబరు

మీకోసం

సిద్దిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు కొందరికి కలమాత్రమే. నిరుపేద ఎస్సీ విద్యార్థుల చదువును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 'టాప్ క్లాస్' పథకం ద్వారా అండగా నిలుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా సుమారు 2,000 మంది విద్యార్థులకు ఈ ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్, పుస్తకాలు, స్టేషనరీ మరియు ఇతర విద్యా సంబంధిత ఖర్చుల నిమిత్తం మొదటి ఏడాది రూ.86,000 అందజేస్తారు. ఆ తర్వాత ప్రతి ఏటా రూ.41,000 చొప్పున ఇస్తారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్ ఫీజుతో పాటు ఇతరాలను ప్రభుత్వమే భరిస్తుంది.

అర్హతలు: • ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. • కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. • ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రముఖ విద్యా సంస్థల్లో రెగ్యులర్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. • మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. • మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. • 30 శాతం బాలికలకు కేటాయించారు. • నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి. • ఒక కుటుంబంలో ఇద్దరికే వర్తిస్తుంది. • ఇతర ఉపకార వేతనాలు పొందుతుంటే అనర్హులు.

హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని రెండో ఠాణా పరిధిలో హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సిద్దిపేట న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు. రెండో ఠాణా సీఐ మురళి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన బోలోరామ్ హరిజన్ అనే వ్యక్తి గతంలో మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఆమెను ఇంట్లో చంపి మృతదేహాన్ని దాచిపెట్టిన ఘటనలో 2025, మార్చి 1న నిందితుడిపై సిద్దిపేట రెండో ఠాణాలో కేసు నమోదైంది. కేసులో భాగంగా అప్పటి సీఐ ఉపేందర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జీషీట్‌ను దాఖలు చేశారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి జయప్రసాద్.. హత్య కేసులో నిందితుడైన బోలోరామ్ హరిజన్‌కు జీవితకాల కఠిన కారాగార శిక్ష, పోక్సో కేసులో కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బీడీ, సిగార్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాముని గోపాలస్వామి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, పద్మ, మోహన్, పుష్ప, చౌదరి, కార్యదర్శులుగా శోభ, సత్యం, రాజు, సులోచన, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేశ్ ఎన్నికయ్యారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

తాండూరు గ్రామీణ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. **నందురెడ్డి** (30) వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా బంధువుల వివాహానికి వెళ్లారు. నందురెడ్డి పొలం పనులకు వెళ్లాడు. స్థానికులు ఫోన్ చేస్తే స్పందించలేదు. పొలం వద్ద పరిశీలించగా షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నందురెడ్డికి భార్య, కుమార్తె, నెలన్నర కుమారుడున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి: హరీశ్‌రావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు

ఈనాడు,సంగారెడ్డి, సంగారెడ్డి టౌన్, జహీరాబాద్, జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకత్వం పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ప్రతీ వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసిన తీరును ఎండగట్టాలన్నారు. కరెంటు కోతలు, ఎరువుల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి భారాస ప్రభుత్వ సమయంలో అన్నదాతలకు చేసిన మేలును వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యలపై 2 నుంచి పోరుబాట: భారాస

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల విధ్వంసక పాలనపై సెప్టెంబరు 2 నుంచి ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడారు. నాయకులు తదితరులు ఉన్నారు.

ఆమోదం లభించినా.. ఆచరణేది?

నారాయణఖేడ్ డివిజన్‌లో చెరువులను నిర్మించడంలో జాప్యం

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, మనూరు: ఖేడ్ నియోజకవర్గంలో సాగునీటి వనరులు అంతంతే. ఫ్లో ఇరిగేషన్ 15 శాతంగానే ఉంది. దాదాపు 25 వేల ఎకరాల వరకు భూములు బీడుగా ఉండగా.. 40 వేల ఎకరాల్లో వర్షాధార పంటలే సాగు చేసుకునే పరిస్థితులు ఉన్నాయి. నియోజకవర్గంలో భూములు అధికంగా ఎత్తు పల్లాలుగా ఉండి చెరువుల నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నాయి. ఎనిమిదేళ్ల కిందట 24 కొత్త చెరువుల నిర్మాణం కోసం నీటిపారుదల శాఖ అధికారులు సర్వేలు నిర్వహించి ప్రతిపాదనలు పంపారు. వాటిల్లో 8 చెరువుల కోసం భూసేకరణకు అవసరమైన 1,299 ఎకరాలను సేకరించేందుకు రూ.13.06 కోట్లు మంజూరయ్యాయి. మూడేళ్ల కిందట నాలుగు చెరువుల నిర్మాణానికి రూ.19.10 కోట్లు మంజూరు చేశారు. వాటిలో ఏస్గి, సుక్కల్ తీర్థ్‌లలో మాత్రమే చెరువుల నిర్మాణం ప్రారంభమై అనంతరం నిలిచిపోయాయి. ఏడాది కిందట రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన సమీక్షలో ఉమ్మడి మెదక్ జిల్లాలో గతంలో మంజూరైన 38 చెరువులకు ఆమోదం తెలిపారు. ఖేడ్ నియోజకవర్గంలోని నాలుగు చెరువుల నిర్మాణం పూర్తయితే బీడు భూములు సాగు భూములుగా మారతాయని ఆశించిన రైతులకు నిరాశ తప్పడంలేదు.

దోవూరు శివారులో బీడు భూమి ఇలా..

8 చెరువులకు భూసేకరణ ఇలా..

మండలం	గ్రామం	మంజూరు (రూ.కోట్లలో)	భూసేకరణ (ఎకరాల్లో)
కంగ్టి	సుక్కల్‌తీర్థ్	1.47	144
నాగల్‌గిద్ద	ఇరక్‌పల్లి	2.11	210
నాగల్‌గిద్ద	ఇరక్‌పల్లి	0.97	96
నాగల్‌గిద్ద	కేశ్వార్	1.02	100
నాగల్‌గిద్ద	ఊట్‌పల్లి	2.87	285
నాగల్‌గిద్ద	ఏస్గి	0.83	72
నాగల్‌గిద్ద	మోర్గి	3.61	380
నారాయణఖేడ్	జగన్నాథ్‌పూర్	0.18	12

నాలుగింటికి అనుమతులు..

మండలం	గ్రామం	నిధులు(రూ.లక్షల్లో)
నాగల్‌గిద్ద	కేశ్వార్	627.20
నాగల్‌గిద్ద	ఊట్‌పల్లి	649.00
నాగల్‌గిద్ద	ఏస్గి	419.10
నారాయణఖేడ్	జగన్నాథ్‌పూర్	214.50

వర్షపు నీటికి అడ్డుకట్ట..

ఈ ప్రాంతంలో భూములు ఎత్తు పల్లాలుగా ఉండి వర్షపు నీరు అక్కడక్కడ పల్లపు ప్రాంతాల్లో నిలుస్తూ ఇంకిపోతోంది. అనువైన చోట్ల చెరువులను నిర్మించి వర్షపు నీటికి అడ్డుకట్ట వేసి సాగుకు అందించాలనే ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. పలు చెరువుల నిర్మాణానికి నిధులు 20 ఏళ్ల కిందట మంజూరైనా స్థల సేకరణలో తీవ్ర జాప్యం చేయడంతో వెనక్కి మళ్లిపోయాయి. మిగిలిన చెరువుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363, నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250, అందోలు 8008573241, జిన్నారం 8008573231 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: ? సంగారెడ్డి పట్టణంలోని బాబా నగర్‌లో మంచినీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. పైపులైన్‌లోకి నీళ్లు చేరడంతో మురుగుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – మురళీ, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాస్ రెడ్డి, పురపాలక కమిషనర్

? సంగారెడ్డి పట్టణంలోని బాలాజీ నగర్‌లో చెత్త సేకరణ వాహనాలు సరిగా రావడం లేదు. వారానికి ఒక రోజు మాత్రమే వస్తున్నాయి. చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించాలి. – అనూరాధ, సంగారెడ్డి

✓ చెత్త సేకరణ వాహనాలు రోజూ వెళ్లాలని సూచనలు చేస్తాం. – సయ్యద్ సాజిద్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

న్యూస్‌టుడే, జహీరాబాద్: ? జహీరాబాద్ పట్టణంలోని రహమత్‌నగర్‌లో రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయి ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి. – నగేశ్వర్, కాలనీవాసి

✓ పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం – జి.ప్రభాకర్, కమిషనర్, జహీరాబాద్ పురపాలిక

పురుగుల అన్నం.. పుచ్చిపోయిన కూరగాయలు

గురుకుల కళాశాల విద్యార్థినుల ఆందోళన

అధికారులకు విన్నవిస్తున్న విద్యార్థినులు

మునిపల్లి, న్యూస్‌టుడే: 'రెండు నెలల నుంచి పురుగుల అన్నం.. పుచ్చిపోయిన కూరగాయలు వండుతున్నారు. ఎలా తినమంటారు సార్. . ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు' అని అధికారుల ముందు విద్యార్థినులు కన్నీళ్లు పెట్టుకున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేరా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ముందు బైఠాయించి విద్యార్థినులు ఆందోళన చేశారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, అందోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి జగదీష్, డీసీవో కల్పన, మునిపల్లి తహసీల్దార్ రంగారావు, ఎస్సై అరవింద్ అక్కడికి చేరుకొని విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో నిల్వ ఉన్న 28 క్వింటాళ్ల బియ్యాన్ని వెంటనే తిరిగి ఎఫ్‌సీఐ గోదాంకు తరలించారు.

కళాశాల ప్రిన్సిపల్ సస్పెన్షన్..: మునిపల్లి మండలం బుధేరా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పుణ్య శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల నిర్వహణ లోపం, భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చేపట్టడంతో చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతిపక్షపాత్ర పోషిస్తోంది తెలంగాణ రక్షణసేనే..: కవిత

మాట్లాడుతున్న కవిత

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తోంది తెలంగాణ రక్షణసేన పార్టేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఆమె ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. పార్టీని స్థాపించి 120 రోజులే అయినా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్‌కు వంద చెరువుల నీళ్లు తాగించామని ఎద్దేవా చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రధాన ప్రతిపక్షంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలకు సంబంధించిన చిన్న సమస్య ఉత్పన్నమైనా ముందుండి పోరాటాలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నారాయణఖేడ్‌లో ఇప్పటి వరకు మూడు కుటుంబాల పాలనే సాగుతోందని, రానున్న రోజుల్లో మార్పు కోసం తమ పార్టీకి సహకరించాలని కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ బాలయ్య, నాయకులు ఉన్నారు.

సంచార జాతులకు సంక్షేమ పథకాలు: అదనపు కలెక్టర్

మహాత్మా జ్యోతిబా ఫులే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పాండు, నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, పుల్కల్, న్యూస్‌టుడే: సంచార జాతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అదనపు కలెక్టర్ పాండు పేర్కొన్నారు. సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పులే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆయన మాట్లాడారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడుపతి వీరేశం, కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు. ● ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలు వారిని ప్రత్యేకంగా నిలుపుతాయని అదనపు కలెక్టర్ పాండు పేర్కొన్నారు. చౌటకూరు తహసీల్దార్ నామాల కిష్టయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

3న జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: 2026-27 సంవత్సరానికి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు ఈ నెల 3న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడాభివృద్ధి ఇన్‌ఛార్జి అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు. 19 రకాల క్రీడల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు గుర్తింపు కార్డుతో రావాలన్నారు.

వీరభద్రస్వామి సేవలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్

బొంతపల్లి (గుమ్మడిదల), న్యూస్‌టుడే: బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కె. సుజాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆమెకు ఆలయ ఈవో రామబ్రహ్మచారి స్వాగతం పలికారు. ఆలయ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ కానిస్టేబుళ్ల సంఘం నూతన కార్యవర్గం

చంద్రయ్యతో సభ్యులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఆబ్కారీ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల ఉద్యోగ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి. రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా ద్వారకానాథ్ ఎన్నికయ్యారు. అనంతరం వారు ఉమ్మడి జిల్లా ఆబ్కారీ శాఖ ఉప కమిషనర్ చంద్రయ్య, సంగారెడ్డి జిల్లా అధికారి శ్రీనివాసరావులను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెద్దమ్మ తల్లి సేవలో ఎమ్మెల్యే

ఆలయంలో మహిపాల్‌రెడ్డి, నాయకులు

జిన్నారం, న్యూస్‌టుడే: గడ్డపోతారం పురపాలిక పరిధిలోని ఖాజీపల్లిలో సోమవారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గద్దె సుష్మగణేశ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కె.బాల్‌రెడ్డి ఉన్నారు.

శ్యామ్ దర్బార్ గోడపత్రిక ఆవిష్కరణ

ఝరాసంగం, న్యూస్‌టుడే: కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఏడాకులపల్లిలో ఈనెల 4న వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శ్యామ్ దర్బార్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మేరకు సోమవారం బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ గోడపత్రికను ఆవిష్కరించారు.

మాదారం-సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కు మధ్య మట్టి రోడ్డు దుస్థితి

అనుసంధాన రోడ్లు.. అడుగేయలేక పాట్లు!

● వర్షాకాలంలో సమస్యను గుర్తించని యంత్రాంగం

న్యూస్‌టుడే, జిన్నారం, పటాన్‌చెరు రూరల్: అవి నిత్యం వేలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారులు. వాటిని గుర్తించి బాగు చేయడం లేదు. బిక్కు బిక్కుమంటూ ప్రయాణం సాగించే పరిస్థితి నెలకొంది. జిన్నారం-అమీన్‌పూర్ మండలాల మధ్య పలు రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాకాలంలో నరకాన్ని తలపిస్తున్నాయి. ఆదాయ వనరులు లేని ప్రాంతాలు కూడా కాదు. రూ. కోట్లు ఆదాయ వనరులు ఉన్న స్థానిక సంస్థల పర్యవేక్షణలో పని చేస్తున్నాయి. పటాన్‌చెరు- జిన్నారం మండలాల మధ్య ఉన్న రహదారిది ఇదే పరిస్థితి.

కార్మికుల అవస్థ..

● సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కుకు మాదారం, కొడకంచి, జిన్నారం తదితర ప్రాంతాల నుంచి వేల మంది కార్మికులు వస్తారు. మాదారం- మెడికల్ డివైజ్ పార్కు మధ్య పూర్తిగా మట్టి రోడ్డు. దీన్ని సీసీగా మారిస్తే బాగుంటుందనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఫలితంగా వర్షం పడితే కార్మికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ● జిన్నారం మండలంలోని శివనగర్-పటాన్‌చెరు మండలం కంజర్ల మధ్య రోడ్డు సుమారు ఐదేళ్లుగా గుంతలతో ఇబ్బంది పెడుతోంది. నిధులు వెచ్చించినా గుత్తేదారులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ రహదారిలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ● అందూర్- సోలక్‌పల్లి- ఇమామ్‌నగర్, కిష్టాయపల్లి- నల్తూరు, మంత్రికుంట- మాదారం రహదారులను విస్తరించాల్సి ఉంది. ఒక వరుస రోడ్డు వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

తీవ్ర సమస్యలెక్కడంటే..

ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో సుమారు 325 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో పని చేసేందుకు చాలా మంది అమీన్‌పూర్, రామచంద్రాపురం, చందానగర్, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి వస్తారు. ఆయా ప్రాంతాలకు అమీన్‌పూర్ పట్టణంలోని లాలాబాయి కాలనీ నుంచి ఐడీఏ బొల్లారం కేవలం కిలోమీటర్ దూరమే. రోడ్డు పూర్తిగా మోకాలు లోతు గుంతలతో దర్శనమిస్తోంది. సమస్యను గుర్తించి నిధులు వెచ్చించినా పనులు మాత్రం చేపట్టలేదు. ఫలితంగా సుమారు 10 కిలోమీటర్ల దూరం కార్మికులు తిరిగి వచ్చే పరిస్థితి నెలకొంది. రాకపోకలకు 2 కిలోమీటర్లు అయ్యేది 20 కి.మీ.లు అవుతుందని కార్మికులు అంటున్నారు.

పైరవీలకు తావు లేదు: ఎస్పీ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సమస్యలు చెప్పే బాధితులు నేరుగా కలవాలని,పైరవీలకు తావు లేదని ఎస్పీ పరితోశ్ పంకజ్ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. బాధితులు తమ గోడును వినిపించారు. పదవీ విరమణ చేసిన ఎస్సైలు కిష్టారెడ్డి, పవన్, రఫీక్‌లను ఎస్పీ,అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి సన్మానించారు. డీపీవో ఏవో పద్మావతి, ఎస్బీ సీఐ సదా నాగరాజు,ఆర్ఐ సురేశ్, పోలీసు ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 1నుంచి 30వరకు నెలరోజుల పాటు పోలీసు చట్టం 30అమలు చేస్తామని ఎస్పీ పరితోశ్ పంకజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

జిన్నారం, న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం డివిజన్ పరిధి వైఎస్ఆర్ కాలనీలో సోమవారం అనుమతి లేని అదనపు అంతస్తులను సీఎంసీ అధికారులు కూల్చివేశారు. అమీన్‌పూర్ ఉప కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు 75 గజాల్లో నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు గుర్తించి చర్యలు తీసుకున్నామని అధికారులు చెప్పారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, మనూరు, న్యూస్‌టుడే: యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జహీరాబాద్ ఎస్సై లవకుమార్ సూచించారు. అల్లీపూర్‌లో సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఎస్సైలు రాజేందర్‌రెడ్డి, వినయ్‌కుమార్ ఉన్నారు. ● మనూరు మండలం శెల్గిరలో సర్పంచి శ్రీశైలం, షీటీమ్ ఏఎస్సై తులసీరాం అవగాహన కల్పించారు.

తరలివచ్చి.. వినతులు సమర్పించి

కలెక్టరేట్‌లో వినతులు ఇస్తున్నఅర్జీదారులు

సంగారెడ్డి టౌన్, జహీరాబాద్ అర్బన్, నారాయణఖేడ్, గుమ్మడిదల, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ గ్రామాల నుంచి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణిలో భాగంగా అధికారులకు వినతులు ఇచ్చి పరిష్కారానికి అభ్యర్థించారు. అదనపు కలెక్టర్లు సంగీత, పాండు వినతులు స్వీకరించారు. ప్రజావాణికి 71 అర్జీలు అందగా ఇందులో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌వి 22, జహీరాబాద్ 5, నారాయణఖేడ్ డివిజన్‌లో మూడు అందినట్లు అధికారులు తెలిపారు.

● నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న తమకు నష్ట పరిహారం అందించాలని న్యాల్‌కల్ మండలం మామిడ్గికి చెందిన ఏసప్ప తదితరులు విజ్ఞప్తిచేశారు. ● తమకు చెందిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. ● పట్టాదారు పాసుపుస్తకంలో తప్పిపోయిన సర్వే నంబర్లు నమోదు చేయాలని అమీన్‌పూర్ మండలం గండిగూడేనికి చెందిన రాములమ్మ విజ్ఞప్తిచేశారు. ● ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని జహీరాబాద్ ఆర్డీవో దేవుజా పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణిలో పాల్గొని అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మొత్తం 14 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ● ఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. సబ్‌కలెక్టర్ ఉమాహారతి అర్జీలు స్వీకరించారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి

అర్హుల పేర్లు జాబితాలో ఉండేలా చూడాలి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్, కంగ్టి, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు చూడాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రెండో దశ సర్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను పరిశీలించాలన్నారు. నమోదు కాని, నోటీసులు అందుకున్న వారి వివరాలను తెలుసుకుని జాబితాలో చేర్పించేలా సహకరించాలన్నారు. మాస్టర్ శిక్షకులు మాణిక్యం, మల్లేష్ యాదవ్, పురపాలిక ఉప ఛైర్మన్ దారం శంకర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ వినోద్ పాటిల్, నాయకులు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు. ● వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు.● కంగ్టి మండలంలోని ఎడ్లరేగడి తండాలో ఇందిరమ్మ నూతన ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: గొడవపడి పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఆదివారం రాత్రి అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాలు.. చేవెళ్ల గ్రామానికి చెందిన **వినయ్**(24) కూలి పని చేసుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన రాణితో పెళ్లయింది. ఆరు నెలల క్రితం భార్యాభర్తలు గొడవ పడ్డారు. రాణి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆగస్టు 30న రాత్రి 8 గంటల సమయంలో ఇంటి పక్కనున్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

యువకుల మధ్య గొడవ..

జహీరాబాద్ అర్బన్, కవేలి(కోహీర్), న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి తన స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కవేలి గ్రామానికి చెందిన ఇస్మాయిల్, రాజు ఇద్దరు స్నేహితులు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో గొడవపడ్డారు. రాజు కత్తితో ఇస్మాయిల్ మెడపై పొడిచాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ఇంటి స్థలం విషయమై జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన నిందితుడికి అందోలు-జోగిపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు సోమవారం ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కరూర్ గ్రామానికి చెందిన దాదాయిపల్లి నాగభూషణం, రాందాస్ మధ్య ఇంటి స్థల విషయంలో 2020లో గొడవ జరిగింది. నాగభూషణంపై రాందాస్ సుత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం నాగభూషణం వట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై వివరించారు.

అంబేడ్కర్ భవనం.. అక్కడికే పరిమితం!

● నాలుగేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు

జహీరాబాద్ పట్టణంలో కేటాయించిన స్థలం

న్యూస్‌టుడే, జహీరాబాద్: బడుగు, బలహీన వర్గాల వారికి ఉపయోగకరంగా ఉండేలా ఇప్పటికే అనేక జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ భవనాలు నిర్మించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ పట్టణంలో కూడా అంబేడ్కర్ భవనం నిర్మిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం, జహీరాబాద్ శివారులో స్థలం కేటాయించింది. అంబేడ్కర్ భవన నిర్మాణానికి అప్పటి మంత్రి నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా నేటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు.

అదిగో.. ఇదిగో.. అంటూ జాప్యం

జహీరాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగానే ఉన్నారు. ఇక్కడ అంబేడ్కర్ భవనం లేక ఆయా వర్గాల ప్రజలు సభలు, సమావేశాలు, స్వచ్ఛంద కార్యక్రమాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని ఏళ్లుగా స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. గత ప్రభుత్వం స్పందించి జహీరాబాద్ శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో అర ఎకరం స్థలం కేటాయించింది. రూ.10లక్షలతో ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. రూ.90 లక్షలతో భవన నిర్మాణానికి 2022 ఏప్రిల్ 18న అప్పటి మంత్రి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించడంలో జాప్యం చేయడం, అంతలోనే ప్రభుత్వం మారిపోవడంతో వచ్చిన నిధులు రద్దయ్యాయి. స్థానిక అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు ఏడాది క్రితం జహీరాబాద్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అనంతరం మంత్రులు, ఎంపీకి పలుమార్లు విన్నవించినా నేటికి కార్యరూపం దాల్చడం లేదు. నిర్మాణ వ్యయం పెరగడంతో భవనానికి రూ.కోటి ఇస్తామని కొందరు, రూ.2 కోట్లు మంజూరు చేయిస్తామని మరికొందరు చెబుతూ తీవ్ర జాప్యం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు విన్నవిస్తాం

త్వరలో ప్రజాప్రతినిధులను కలిసి భవన నిర్మాణం గురించి విన్నవిస్తాం. సంఘం సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలని కోరతాం. – డి.శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

పోషక యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

సూచనలిస్తున్న డా.విజయ్‌కుమార్

గుడుపల్లి (జహీరాబాద్ అర్బన్), న్యూస్‌టుడే: చెరకులో పోషకాల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధ్యమని బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్ అన్నారు. మొగుడంపల్లి మండలం గుడుపల్లిలో సోమవారం శాస్త్రవేత్త విజయలక్ష్మి, ఏఈవో ప్రదీప్‌కుమార్‌లతో కలిసి చెరకులో చీడల నివారణపై అవగాహన కల్పించారు. సర్పంచి సుదర్శన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: పుర ఛైర్‌పర్సన్

సదాశివపేట, న్యూస్‌టుడే: పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని పురపాలక సంఘం అధ్యక్షురాలు మునిపల్లి అంజమ్మ అన్నారు. సోమవారం పురపాలిక సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పురపాలిక ఉపాధ్యక్షురాలు రేణుక, సభ్యులున్నారు.

EENADU eClassifieds

REAL ESTATE
LAND FOR SALE
జనగాం- హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ & జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ హైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

JOBS
రాఘవ అసెట్ ఫైనాన్స్ Pvt. Ltd లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ Sdpt-2, దుబ్బాక-2, ప్రజ్ఞాపూర్-2, హుస్నాబాద్-2. సెల్: 91009 02181, 82

MARKETING/ SALES
రియల్ ఎస్టేట్ శాలరీ బేస్ మార్కెటింగ్ డైరెక్టర్ కావలెను. స్మార్ట్ సిటీ, జహీరాబాద్ NIMZ 5KM, రూ. 3,50,000/- ప్లాట్, EMI, స్పా. రిజి. Sal+inc= 50K ✆ 9281447559

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి: 9000014771

(c) eenadu